క్లుప్తంగా

24న అక్కినేని శత జయంతి వేడుకలు

పాత గుంటూరు: స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం అక్కినేని శత జయంతి వేడుకల్ని నిర్వహించనున్నట్లు కళాదర్బార్ ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులు పాతూరి రంగారావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సభా కార్యక్రమంలో సినీ ప్రముఖులు జగపతి బాబు, గౌతమి, బి. గోపాల్‌కు ఏఎన్ఆర్ అవార్డుల్ని ప్రదానం చేసి సత్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం అక్కినేని స్వర గానామృతం ఉంటుందని తెలిపారు. సంగీతాభిమానులు, సినీ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

మహిళా బిల్లు ఆమోదంలో బహుజనులకు అన్యాయం

నెహ్రూనగర్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశంలో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్యాయం జరిగిందని రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. భారతదేశంలో వందకు 85 శాతం ఉన్న ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఎంత శాతమో చెప్పకుండా బిల్లు ఆమోదించడం అన్యాయమని తెలిపారు.

విద్యార్థులకు స్ఫూర్తినిస్తున్న టెడ్ఎక్స్ వీవీఐటీ




నంబూరు వీవీఐటీలో స్ఫూర్తి నింపుతున్న ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన వక్తలు

పెదకాకాని: వీవీఐటీ విద్యార్థులు నిర్వహించిన టెడ్ఎక్స్ వీవీఐటీ చేజింగ్ వరల్డ్ (మారుతున్న ప్రపంచం) విద్యార్థులలో స్ఫూర్తి నింపడం, ప్రేరణ కలిగించే విధంగా సాగిందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన 9 మంది వక్తలు వారి జీవితానుభవాలను, అధిగమించిన సవాళ్ళను విద్యార్థులకు వివరించారు. జీవితంలో సవాళ్ళు ఎదురైనపుడు వాటిని అధిగమించి ఏ విధంగా ముందుకు సాగాలో తెలియజేస్తూ వక్తలు ఈ కార్యక్రమంలో ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు అంశాలపై అవగాహన కలిగించి క్లిష్ట సమయాల్లో సరైన మార్గాలు ఎన్నుకునే విధంగా విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ముఖ్య వక్తలుగా ప్రముఖ చైల్డ్ సైకాలజిస్ట్ ఘుగ్ధాని మన్సీ, ట్రెయిన్ మై బ్రెయిన్ వ్యవస్థాపకురాలు, రచయిత అనిష్ బెహేటీ, టెస్టింగ్ సాఫ్ట్‌వేర్ నిపుణుడు భగేష్వర్ మోహన్, స్టెమీపై గాల్స్ ఫౌండర్ అనీషా మద్రపు, గిన్నీస్ వరల్డ్ రికార్డ్ అందుకున్న లఘుచిత్ర దర్శకుడు దీపక్‌రెడ్డి, ప్రముఖ నటి సబా నటీష్, ఆర్కిటెక్ అశ్విని శ్వేత, విద్యార్థులు హర్ష, సమీరాలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, టెడ్ఎక్స్ సంధానకర్త పాలపర్తి బిందు మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

గుంటూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.ఆదినారాయణ తెలిపారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని లాలుపురం, వెంగళాయపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు పరిసరాలు పరిశుభ్రత తదితర విషయాలను వివరించారు. పంచాయతీ సిబ్బందికి తడిచెత్త, పొడిచెత్త సేకరణ తదితర అంశాలను వివరించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పారిశుద్ధ్యం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఓ. శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ అశ్విన్, పంచాయతీ కార్యదర్శి మీనాక్షి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ డి. యాకోబుకు తమ యూనివర్సిటీ బుధవారం పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పీ నాగభూషణ్ తెలిపారు. యాన్ ఎఫిషియంట్ క్రిప్టో-స్కీమ్ ఫర్ ప్రైవసీ ప్రిసర్వేషన్ ఆఫ్ అన్‌స్ట్రక్చర్డ్ టెక్స్ట్ అండ్ స్ట్రక్చర్డ్ డేటా ఇన్ పబ్లిక్ క్లౌడ్ అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేశారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డి. యాకోబును పలువురు అభినందించారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం వేగవంతం

అధికారులకు కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసి, డిసెంబర్ నాటికి గృహ ప్రవేశాలకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత లే అవుట్స్ వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం ఏ మేరకు పూర్తయింది... గ్రౌండ్ లెవల్‌లో ఎన్ని ఉన్నాయి? మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాల్ని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని, కాంట్రాక్టర్లు ఇందుకు అవసరమైన కార్మికుల్ని సిద్ధం చేసుకోవాలని ఆమె సూచించారు. ప్రతి లే అవుట్‌లో కాంట్రాక్టర్ రోజూ నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు చేయాలని, నోడల్ అధికారులు కూడా పర్యవేక్షణ చేయాలని తెలిపారు. లే అవుట్ల వారీగా ఎప్పటికప్పుడు పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఏ సమస్య ఎదురైనా అధికారులు సమన్వయంతో పరిష్కరించి, పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. లే అవుట్‌లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు వీలుగా రోడ్ల మరమ్మతులు చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. గ్రావెల్ సమస్య ఉన్న లే అవుట్స్‌లో ఆర్డీవోతో మాట్లాడాలని నోడల్ అధికారులకు తెలిపారు. ఇళ్ల నిర్మాణ పనుల్ని ఎప్పటికప్పుడు బిల్స్ కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. డ్రాయింగ్ బ్రాంచ్‌లో నిబంధనలకు విరుద్ధంగా అధికారుల అనుమతి లేకుండా టెండర్ ఓపెన్ చేసిన ఔట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్‌ని విధుల నుంచి తొలగించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న డ్రాయింగ్ బ్రాంచ్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేయాలని ఎస్ఈని ఆదేశించారు. డ్రాయింగ్ బ్రాంచ్ పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వర్క్ లోడ్ తక్కువ ఉన్న ఎమినిటీ కార్యదర్శుల్ని కేటాయించాలని చెప్పారు. గాంధీ పార్క్ త్వరలో ప్రారంభం కానున్నందున పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఈఈని ఆదేశించారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ భాస్కర్, ఈఈ సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాస్, హౌసింగ్ ఈఈ శంకరరావు, నగరపాలక సంస్థ, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ధ్యేయం

వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా



శంకుస్థాపన చేస్తున్న నూరి ఫాతిమా

పట్నంబజారు: ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా ఆదేశాల మేరకు బుధవారం నియోజకవర్గంలోని 15వ డివిజన్ భావాజీనగర్ 7వ లైను, సాయికృష్ణనగర్ 2వ లైన్లలో రూ. 60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ హయాంలో యూజీడీ పనుల పేరుతో రోడ్లను అధ్వానంగా మార్చారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆయన ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని చెప్పారు. పేదలకు అందుతున్న సంక్షేమ ఫలాల్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రభుత్వంపై లేని పోని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రామబోయిన అజయ్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, చెంచయ్య, సాయి పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల అభ్యున్నతికి మోదీ కృషి



మోదీ చిత్రపటంతో బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: నూతన పార్లమెంట్‌లో మహిళ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని బీజేపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. కొత్తపేటలోని శ్రీమేధ మహిళా కళాశాల క్యాంపస్‌లో బుధవారం ధన్యవాద్ మోదీజీ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపారాణి, డాక్టర్ ఉమాశంకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ ప్రధానీ నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని వెల్లడించారు. మహిళ సాధికారిత దిశగా దేశాన్ని నడిపిస్తున్న ఘనత ప్రధాని మోదీకే దక్కుతోందని తెలిపారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్ జైన్, మంత్రి సుగుణ, కత్తి సరోజని, బొల్లాప్రగడ శ్రీదేవి, ఎస్.నాగమల్లేశ్వరి, రమాదేవి, లక్ష్మి, రేణుకాదేవి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇక్షు గణపతికి పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు ముస్తఫా, మద్దాళి గిరిధర్

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలో వాసవీ యూత్ ఆధ్వర్యంలో 25వ విజయ గణపతి నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం స్వామిఇక్షు (చెరుకు) గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మహమ్మద్ ముస్తఫా, మద్దాలి గిరిధర్ పాల్గొని, గణనాథుడికి ప్రత్యేక పూజల్లో నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమాన్ని అధ్యక్షుడు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగ వెంకటనారాయణ, కోశాధికారి కాజా శ్యాంసుందర్ పర్యవేక్షించారు.

అన్నదానాన్ని ప్రారంభించిన డెప్యూటీ మేయర్

పట్నంబజారు: వినాయకచవితి వేడుకల్లో భాగంగా బుధవారం రాజాగారితోటలోని పందిరిలో ఏర్పాటు చేసిన అన్నదానాన్ని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజిల ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు షేక్ షౌకత్, రామకృష్ణారెడ్డి, ఆవుల కోటేశ్వరరావు, ఆనంద్, జానకి, ఏడుకొండలు, రాజారెడ్డి, వినాయకరెడ్డి, పార్వతి పాల్గొన్నారు.

75 ఏళ్ల పార్లమెంటరీ వ్యవస్థకు తీపిగుర్తు



మాట్లాడుతున్న అనంతరామయ్య, వేదికపై సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: దేశ ప్రజాతంత్ర యాత్రలో సామాన్య పౌరుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొన్న చరిత్ర పాత పార్లమెంట్ భవనానికి ఉందని, ఎన్నో కీలక ఘట్టాలకు వేదికైన ఆ భవనం 75 ఏళ్ల పార్లమెంటరీ వ్యవస్థకు తీపిగుర్తుగా మిగిలిపోతోందని అవగాహన సంస్థ సభ్యులు అభిప్రాయపడ్డారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం 75 ఏళ్ల ప్రస్థానంలో నడిచిన పార్లమెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.సి.హెచ్.అనంతరామయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత 75ఏళ్ల ప్రస్థానంలో నడిచిన పార్లమెంట్ భవనం ఇప్పుడు తెరమరుగవుతోందన్నారు. ఇక్కడ వేలాది చట్టాలపై ఎడతెగని చర్చలు జరిగాయని గుర్తు చేశారు. ఎన్నో కీలక నిర్ణయాలు రూపు దిద్దుకున్నాయని తెలిపారు. రాజీలేని ధోరణిలో వాద, ప్రతివాదాలు సాగాయని చెప్పారు. సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడుతూ 1927లో నిర్మించిన పాత పార్లమెంట్ భవనం బ్రిటిష్ హయాంలోనూ పని చేసిందన్నారు. రాజ్యాంగాన్ని ఈ భవనం నుంచే ఆమోదించారని తెలిపారు. కార్యక్రమంలో విద్యావేత్త సింగరయ్య, సీనియర్ సిటిజన్ బసవగుప్తా తదితరులు పాల్గొన్నారు.

బిల్లు ఆమోదంపై మహిళల హర్షం

మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళ రిజర్వేషన్ బిల్లుకు మోక్షం లభించడంపై అవగాహన మహిళా విభాగం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం మహిళా సభ్యులు పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్ నాయకురాలు పి.విజయశ్రీ మాట్లాడుతూ పార్లమెంట్ నూతన భవనంలో సమావేశమై మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని ఆమోదించడం గొప్ప విషయమని తెలిపారు. అధికార, ప్రతిపక్షాలు కూడా మహిళా రిజర్వేషన్ బిల్లును సమర్థిస్తుండటం శుభపరిణామని పేర్కొన్నారు. ఈ బిల్లుతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మహిళలకు విస్తృత ప్రాధాన్యత లభిస్తుందని పేర్కొన్నారు. రచయిత్రి ఎ.వి.కె.సుజాత మాట్లాడుతూ బిల్లును సత్వరమే అమలులోకి తీసుకు రావాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శ్రీదేవి నవరాత్రుల మహోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పాత గుంటూరు: ఆర్. అగ్రహారంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో అక్టోబరు 15 నుంచి 23 వరకు శ్రీ దేవీ నవరాత్రుల మహోత్సవాల్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యేలు షేక్ మహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్ తెలిపారు. ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ అక్టోబరు 15 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న ఉత్సవాలలో ప్రతిరోజు అమ్మవారు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని పేర్కొన్నారు. 23న సాయంత్రం 6 గంటలకు అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి సాధు ప్రతాప్, ఆలయ కార్యనిర్వహణాధికారి పాదర్తి దుర్గారావు, ఉత్సవ కమిటీ సభ్యులు టీఎల్‌వీ వీరాంజనేయులు, దేవరశెట్టి రామకృష్ణ, నేరెళ్ల హరి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

పెదనందిపాడు: విద్యార్థిపై దాడి చేసి కులం పేరుతో దూషించిన ఘటనపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాలపర్రు గ్రామానికి చెందిన అన్నలదాసు ప్రతాప్ నాగులపాడు శ్రీనివాస హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు. పెదనందిపాడు గ్రామానికి చెందిన బలుసుపాటి కామేష్‌తో జరిగిన చిన్న గొడవ నేపథ్యంలో ప్రతాప్‌ను కులం పేరుతో దూషించి, దాడి చేశాడు. గాయపడిన ప్రతాప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలియజేశారు.

ఢిల్లీ తరలి వెళ్లిన బీసీ సంక్షేమ సంఘ నాయకులు

తెనాలి అర్బన్: బీసీలకు 56శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు చలో బీసీ...చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ నవ చైతన్య సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకుడు మేడిబోయిన గంగా యాదవ్ పేర్కొన్నారు. మార్కెట్ లోని సంఘ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మల్లంపల్లి భీష్మ పాములు, మేకల శ్రీను, నల్లగొర్ల గంగాదేవి, ఆరాధ్యుల శివ, అశోక్, పి. యలమంద, వెంకటేశ్వరరావు, ఎస్. వెంకయ్య పాల్గొన్నారు.

82 ఏళ్ల వృద్ధుడికి అత్యాధునిక హృద్రోగ చికిత్స



డాక్టర్ కొసరాజు కమలాకర్

గుంటూరు మెడికల్: గుండెజబ్బుతో బాధపడుతున్న 82 ఏళ్ల వృద్ధుడికి అత్యాధునిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు లైఫ్ హాస్పిటల్‌కు చెందిన ఇంట్రవెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కొసరాజు కమలాకర్ తెలిపారు. స్థానిక కొత్తపేటలోని హాస్పిటల్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం బ్రాహ్మణపల్లికి చెందిన 82 సంవత్సరాల మల్లయ్య గుండెజబ్బుతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఛాతిలో నొప్పి, కళ్లు తిరిగి పడిపోవడం సమస్యలతో బాధపడుతూ ఈనెల 16న చికిత్స కోసం తమ వద్దకు వచ్చారని పేర్కొన్నారు. వృద్ధుడికి వైద్య పరీక్షలు చేసి, గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన కవాటం కుచించుకుపోయి ప్రాణాపాయంలో ఉన్నట్లు నిర్ధారించామన్నారు. తక్షణమే అత్యాధునిక సాంకేతిక విధానంలో '' ట్రాన్స్‌క్యాథకల్ అయోటిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్'' సర్జరీ చేసి వృద్ధుడి ప్రాణాలు కాపాడామని డాక్టర్ కొసరాజు వివరించారు. వయస్సు ఎక్కువగా ఉండి, ఓపెన్ హార్ట్ సర్జరీ చేసేందుకు అత్యధిక రిస్క్ ఉన్నవారిలో కోత, కుట్లు లేకుండా ఇలాంటి ఆధునిక చికిత్స విధానంలో ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడవచ్చని తెలిపారు. ఆపరేషన్ చేసేందుకు గంటన్నర సమయం పట్టిందని, ఆరోగ్యం కుదటపడడంతో బుధవారం ఆసుపత్రి నుంచి మల్లయ్యను డిశ్చార్జి చేస్తున్నామని చెప్పారు. ఆధునిక సాంకేతికత ఉపయోగించి వృద్ధుడి ప్రాణాలు కాపాడిన కార్డియాలజిస్టును లైఫ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సజ్జా రవీంద్రబాబు అభినందించారు. గత 15 సంవత్సరాలుగా అత్యాధునిక వైద్య సేవల్ని సాధారణ ఫీజులతోనే రోగులకు తాము అందిస్తున్నామని ఆయన వెల్లడించారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, తదితరులు

పెదకాకాని: క్రీడల అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం అభినందనీయమని గుంటూరు, కృష్ణా జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన ఆటల పోటీలు బుధవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నంబూరు తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు శరీరానికి మంచి వ్యాయామాన్ని ఇస్తాయన్నారు. క్రీడాకారుల మధ్య స్నేహసంబంధాలు పెంపొందుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో రాణించడం ద్వారా ఉత్తమ క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఈ పోటీలను ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించడాన్ని అభినందించారు. క్రీడా మైదానంలో వేదికను సొంత నిధులతో నిర్మించడానికి ముందుకు వచ్చిన బండి అశోక్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అనంతరం పోటీల్ని ప్రారంభించారు. గుంటూరు రీజియన్ వ్యాయామ విద్యాపర్యవేక్షకుడు షేక్ బాషా క్రీడల నిర్వహణ, వసతుల కల్పన పట్ల హర్షం వ్యక్తం చేశారు. క్రీడల నిర్వహణను పాఠశాల పీఈటీ మస్తాన్‌రెడ్డి పర్యవేక్షించగా 30 మంది వ్యాయామోపాధ్యాయులు నిర్వహించారు. పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల నుంచి అండర్ 14, అండర్ 17 బాలబాలికలు 200 మంది పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, బాల్ బాడ్మింటన్, షెటిల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపరచిన క్రీడాకారులతో నియోజకవర్గ స్థాయి టీంలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దడం జరుగుతుందని పీడీ మస్తాన్‌రెడ్డి వివరించారు. ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, జోసఫ్, జ్యోతి, ఇంద్రావతి పాల్గొన్నారు.

ప్రేక్షకుల హృదయాల్లో ఏఎన్ఆర్ స్థానం పదిలం

తెనాలి అర్బన్: ఏడు దశాబ్దాలకు పైగా తన నటన ద్వారా తెలుగు వారి హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నటుడు అక్కినేని నాగేశ్వరరావు అని స్వరలయ వేదిక వ్యవస్థాపకులు లక్కరాజు సాయి కొనియాడారు. నటసామ్రాట్ డాక్టర్ అక్కినేని శత జయంతి సభను స్వరలయ వేదిక ఆధ్వర్యంలో బుధవారం మారీసుపేటలో నిర్వహించారు. ముందుగా ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ అక్కినేని 1946లో నటించిన బాలరాజు ఆయనకు ఎంతో కీర్తిని తెచ్చిపెట్టిందని గుర్తు చేశారు. 250కు పైగా చిత్రాలలో నటించిన అక్కినేని నటులకు ఎంతో ఆదర్శమని చెప్పారు. అనంతరం సీనియర్ రంగస్థల నటుడు కావూరి సత్యనారాయణకు అక్కినేని శత జయంతి పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. సమావేశంలో పినపాటి సురేష్, శ్రీధర్, వెంగళరావు, హేమంత్, మల్లేశ్వరరావు, వెంకీ, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా తులసి యోగీష్ చంద్ర పుట్టిన రోజు వేడుకలు



కేక్ కట్ చేస్తున్న తులసి యోగీష్, తులసి రామచంద్ర ప్రభు తదితరులు

కొరిటిపాడు(గుంటూరు): ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు కుమారుడు యోగీష్ చంద్ర జన్మదిన వేడుకలు బుధవారం పలు రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు , పారిశ్రామికవేత్తలు, అభిమానుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగాయి. అరండల్‌పేటలోని తులసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన జన్మదిన భారీ కేకును తులసి యోగీష్ కట్ చేశారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశసేవ నుంచి స్ఫూర్తి పొందిన యోగీష్ చంద్ర బీజేపీలో చేరినట్లు తెలిపారు. యోగీష్ చంద్ర మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ఇప్పుడు చేస్తున్న సేవ కార్యక్రమాలకు తోడుగా , భవిష్యత్తులో మరిన్ని చేస్తామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం పురస్కరించుకుని 23న జరిగే మెగా రక్త దాన శిబిరాలకు ప్రజలందరూ తరలి వచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. యోగీష్ అభిమాని నాగ సుధీంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ వికలాంగుల వసతి గృహంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉగ్గిరాల సీతారామయ్య, బీజేపీ మహిళ నేతలు మంత్రి సుగుణ, కోలా రేణుక, రమాదేవి, మాగంటి సుధాకర్ యాదవ్, అప్పిశెట్టి రంగారావు, వనమా నరేంద్ర, బైరిశెట్టి మల్లికార్జునరావు, ఈమని మాధవరెడ్డి, ఇండ్ల శ్రీధర్, బోలగని సాంబయ్య , దళవాయి సుబ్రహ్మణ్యం, కనకం నరసింహారావు, హోమియో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కొసన యోగానందం, తోట శ్రీనివాస్, పసుపులేటి రమణయ్య, తిరుమలశెట్టి రమేష్, మిరియాల శ్రీనివాస్, తులసి గ్రూప్ సిబ్బంది, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

విపత్తుల కార్యనిర్వహణ పరిశీలన



తాడేపల్లి రూరల్: స్థానిక ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని బుధవారం ప్రొబేషనరీ ఐపీఎస్ అధికారి పంకజ్ కుమార్ మీనా సందర్శించారు. ఈ సందర్భంగా విపత్తుల సంస్థ అవలంబిస్తున్న సాంకేతికతను గురించి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పంకజ్ కుమార్‌కు వివరించారు. తుపాన్లు, వరదలు, వడగాల్పులు, భారీ వర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి పంపించే కార్యాచరణను వివరించారు. వాతావరణ పరిశోధన విభాగాలలోని వివిధ అంశాలను, కామన్ అలెర్ట్ ప్రోటోకాల్, ఏపీ అలెర్ట్ ద్వారా ప్రజలకు హెచ్చరిక మెసేజ్ పంపించే విధానాలను, కమ్యూనికేషన్ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్, వాకీ టాకీ, వీశాట్ కమ్యూనికేషన్ పరికరాల పనితీరును విపత్తుల సంస్థ ఈడీ డాక్టర్ సి. నాగరాజు, రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.ఎం. అలీలు పంకజ్ కుమార్‌కు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపలకలూరు గ్రామానికి చెందిన కుందురు మల్లేశ్వరరావుకు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో రెండవ కుమార్తె సుకన్య(17) బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని సమాచారం మేరకు ఘటన స్థలికి పోలీసులు చేరుకున్నారు. ఘటన జరిగిన తీరును పరిశీలించి మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.